ఇంటర్నల్ పరీక్షలకు అనుమతించలేదని
ఎస్‌పీటీయూ విద్యార్థుల నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో ఇంటర్నల్ ఎగ్జామ్స్ రాసేందుకు వెళ్లిన విద్యార్థులకు చుక్కెదురైంది. అటెండెన్స్ లేదనే పేరుతో దాదాపు 90 శాతం మంది విద్యార్థులను అనుమతించలేదు. ఎంసీజే ప్రథమ సంవత్సరంలో 40 మంది విద్యార్థులు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే ఇంటర్నల్స్ రాశారు. రెండో సంవత్సరంలో కొందరికి అనుమతి ఇచ్చినా, హెచ్‌ఓడీ తీరుకు నిరసనగా మిగిలిన విద్యార్థులు ఇంటర్నల్స్‌ను బాయ్‌కాట్ చేశారు. వర్కింగ్ పీపుల్స్, వర్కింగ్ జర్నలిస్టులు రోజూ క్లాసులకు హాజరు కాలేరని, వెసులుబాటు ఇవ్వాలని కోరారు. వి వాంట్ జస్టిస్.. అంటూ వర్సిటీ ఆవరణలో నినాదాలు చేశారు. ఎగ్జామ్ గది ఎదుట నిరసన తెలిపారు.



కొనసాగుతున్న నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలను కూల్చివేసినా..
అధికార పార్టీ నేతల అండతో పనులు ప్రారంభం

పేట్‌బషీరాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతుల్లేని నిర్మాణాలను అధికారులు కూల్చివేసినా.. మళ్లీ నిర్మాణలు కొనసాగుతున్నాయి. దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే 10 కమర్షియల్ దుకాణ సముదాయాలను నిర్మించారు. రెండు రోజుల క్రితం స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు కూల్చివేయిస్తుండగా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు, అతడి అనుచరులు ఎక్స్‌కవేటర్ అద్దాలను ధ్వంసం చేసి, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. 24 గంటలు కాకముందే అధికార పార్టీ నేతల అండతో నిర్మాణ పనులను ప్రారంభించారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ వివరణ కోరదామని 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేయగా స్పందించలేదు.

సైబర్ నేరాలపై 4.8 లక్షల మందికి అవగాహన

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైబర్ జాగరూకత దివస్‌ను గురువారం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైబర్ క్రైం డీసీపీ బి. సాయిశ్రీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై 4.8 లక్షల మందికి అవగాహన కల్పించామని తెలిపారు. 41 విద్యాసంస్థలు, 18 పార్కులు, 5 రెసిడెన్షియల్ కమ్యూనిటీలు, 4 కార్పొరేట్ సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిచామని పేర్కొన్నారు. ఎఫ్ఎం రేడియోలోనూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించామన్నారు. మెట్రో రైల్ భాగస్వామ్యంతో ప్రయాణికులకు అవగాహన కల్పించామని డీసీపీ తెలిపారు.



తుదిమెరుగులు దిద్దుకుంటున్న హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్

హైటెక్‌సిటీ, హాఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్లు
డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న మరో రెండు రైల్వేస్టేషన్లను డిసెంబరులో ప్రారంభించేందుకు దక్షిణమధ్యరైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హైటెక్‌సిటీ, హాఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్లలో రూ. 55.16కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. హైటెక్‌సిటీ స్టేషన్‌లో రూ.25.95కోట్లతో చేపట్టిన రీడెవలప్‌మెంట్ పనులు 81శాతం పూర్తికాగా, హాఫీజ్‌పేట్‌లో 84 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా స్టేషన్లలో ప్రధానంగా దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మిగిలిన పనులను నవంబరు చివరికల్లా పూర్తి చేసి డిసెంబరులో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

తెలుగు విశ్వవిద్యాలయం
సాహితీ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో ఉత్తమ రచనలను ప్రోత్సహించడానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తోంది. 2024, 2025 సంవత్సరాలకు ప్రదానం చేసే పురస్కారాల ఎంపికకు పాఠకుల నుంచి సూచనలు, రచయితల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2021 జనవరి నుంచి 2024 డిసెంబరు మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన వాటిలో ఉత్తమంగా భావించిన రచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రచయిత మరణించినా వారి రచనలను సూచించవచ్చన్నారు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 10 ప్రక్రియల్లో అన్ని ప్రక్రియలకు గాని, కొన్నింటికి గాని తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చన్నారు. సూచనలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ కర్త పేరు పేర్కొనాలి. రచయితలు కూడా తమ గ్రంథాలను సూచించవచ్చన్నారు. కవితా సంపుటి అయితే కనీసం 60 పేజీలు, మిగతా ప్రక్రియల్లో పుటల పరిమితిలేదు. రచయితలు తమ దరఖాస్తులను రిజిస్ట్రార్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి ప్రాంగణం, సాయినగర్ రోడ్, మేడ్చల్, మాల్కాజిగిరి, హైదరాబాద్- 500118, చిరునామాకు ఈనెల 25వ తేదీలోగా పంపించాలని రిజిస్ట్రార్ కోరారు.

వ్యభిచార గృహంపై దాడి

● ఇద్దరు ఉగాండా యువతులను కాపాడిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, నాచారం పోలీసులు దాడిచేసి ఇద్దరు ఉగాండా మహిళలను కాపాడారు. కస్టమర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డానియేల్ అనే వ్యక్తి నాచారం భవానీనగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉగాండాకు చెందిన ఇద్దరు యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. లొకాంటో యాప్ ద్వారా కస్టమర్‌లను సంప్రదించిన అతడు వారికి మహిళల ఫొటోలు పంపి, ఆన్‌లైన్‌లో పేమెంట్ తీసుకొని కస్టమర్లను భవానీనగర్‌లోని వ్యభిచార గృహానికి పంపేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి కండోమ్‌లతోపాటు, డబ్బు, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కస్టమర్ సంపత్‌కుమార్ మోహితేపై కేసు నమోదు చేశారు. డానియేల్ పరారీలో ఉన్నాడని తెలిపారు.



మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు దశదిన కర్మ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్, అభిలాష్, పూర్ణ, వై.సంతోష్ రావు, కౌశిక్, నర్సింహారెడ్డి, పరమేష్, ప్రభాకర్ - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ చేయాలి

● మాజీ ఎంపీ వి.హనుమంతరావు

అంబర్‌పేట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : బీసీల 42శాతం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని పార్టీల వారీగా రిజర్వేషన్లు కాకుండా పార్లమెంట్ సవరణ ద్వారానే రిజర్వేషన్లు చేయాలని మాజీ ఎంపీ, ఓబీసీ పార్లమెంటరీ కమిటీ మాజీ చైర్మన్ వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం బీసీ జాక్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మౌనదీక్షలో భాగంగా గురువారం బీసీ కన్వీనర్ బీసీ జాక్ చీఫ్ కో-ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద మౌనదీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీసీలకు 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడానికి హామీ ఇచ్చిందన్నారు. హామీని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 9 అడ్డుకోవడానికి కొందరు కోర్టుకు వెళ్లారని పేర్కొన్నారు. కోర్టులో న్యాయపరంగా నిలువలేకపోవడం వల్ల రిజర్వేషన్ ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు శాశ్వతంగా దక్కాలంటే పార్లమెంట్ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని రాజకీయ పార్టీల అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రధాని వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. లేనిపక్షంలో వచ్చే నెల మొదటి వారంలో వేల మందితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి పార్లమెంట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ కో-ఆర్డినేటర్లు గుజ్జ కృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాంకుర్మ, బీసీ కుల సంఘాల కో-కన్వీనర్ శేఖర్ సగర, వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీటి మల్లయ్య, డాక్టర్ పురుషోత్తం, తారకేశ్వరి వాణి, లింగంగౌడ్ పాల్గొన్నారు.



బీసీ మౌనదీక్షలో మాజీ ఎంపీ హనుమంతరావు, గుజ్జ కృష్ణ తదితరులు

డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : కవాడిగూడ డివిజన్ సూరజ్‌నగర్ బస్తీవాసుల సౌకర్యార్థం డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మించేలా వాటర్‌వర్క్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశించారు. లింక్‌బ్రిడ్జి ర్యాంప్ నిర్మాణం పూర్తైతే సూరజ్‌నగర్ బస్తీవాసులకు డ్రైనేజీ కనెక్షన్ లేకుండా పోతుందని వాటర్‌వర్క్స్ అధికారులు వెంటనే ప్రతిపాదనలు పంపి డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ సూరజ్‌నగర్‌లో నెలకొన్న సమస్యలపై పాదయాత్ర చేయాలని బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో కలిసి బస్తీని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూరజ్‌నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపి నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాటర్‌వర్క్స్ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా బస్తీలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఆధునికీకరణ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వల్లాల శ్యాంయాదవ్, ఎస్‌డీ సాయికృష్ణ, సూరజ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల అంజయ్య, ప్రధాన కార్యదర్శి నాగేష్, ఉపాధ్యక్షుడు ఎం ప్రకాష్, సెక్రటరీ నర్సింహ, కోశాధికారి ఏ శివ, చైర్మన్ చంద్రశేఖర్, నగరనాయకులు, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీకరెడ్డి, ఏఈ సుప్రజ పాల్గొన్నారు.



డ్రైనేజీ సమస్యపై వాటర్‌వర్క్స్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

బీఆర్ఎస్ హయాంలోనే జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గుర్తుచేశారు. అయితే జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ఇప్పటి వరకు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంత మేరకు నిధులు కేటాయించారో బహిరంగ ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్‌గూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వెంకటేష్, అంబర్‌పేట కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే స్థానిక మహిళలు, వృద్ధులతో కలిసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బి.లింగంగౌడ్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో వృద్ధ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేష్ తదితరులు

15న కామారెడ్డిలో బీసీ ఆక్రోశ సభ

రాంనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 15న కామారెడ్డిలోని సత్యపంక్షన్‌హాల్‌లో బీసీ ఆక్రోశ సభ నిర్వహిస్తున్నట్లు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనసమితి గౌరవ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవులు, గౌరవ వైస్‌చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలగౌని బాల్‌రాజ్ గౌడ్ తెలిపారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ గురువారం జరిగింది. ఈ సందర్భంగా చిక్కడపల్లిలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు 42శాతం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ఆ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలన్నారు. రిజర్వేషన్ల సాధన కోసం సాధన సమితి రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పందన లేదన్నారు. రాష్ట్రంలోని 30 జిల్లాల్లో 200 మండలాల్లో అధికారులకు తమ డిమాండ్ల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 15న కామారెడ్డిలో బీసీ ఆక్రోశ సభ నిర్వహిస్తున్నట్లు ఈ సభను విజయవంతం చేయాలని వారు కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, చిరంజీవులు, డాక్టర్ విశారదన్ మహారాజ్



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతూ రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. 40 సంవత్సరాలు గల వ్యక్తి మలక్‌పేట - కాచిగూడ రైల్వేస్టేషన్ల నడుమ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం



వృద్ధుడి మృతదేహం

చిక్కడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : చిక్కడపల్లి పోలీసులు ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కాలేజీ ఎదురుగా ఫుట్‌పాత్‌పై యాచకుడిగా కనిపిస్తున్న 65 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు 108 సిబ్బందిని రప్పించగా ఆ వ్యక్తి మృతిచెందినట్లు నిర్ధారించారు. వృద్ధుడిని ఎవరైనా గుర్తిస్తే చిక్కడపల్లి పీఎస్‌లో సమాచారం అందించాలని కోరారు.

రైలు ప్రయాణికురాలి బంగారు నగలు, నగదు తస్కరణ

బర్కత్‌పుర, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికురాలి బంగారు నగలు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా హాఫీజ్‌పేటకు చెందిన జైసింగ్ గౌరు(38) కుటుంబ సభ్యులతో కలిసి కాచిగూడకు రావడానికి రాజస్థాన్ జైపూర్‌లో బికనూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. మహారాష్ట్ర నాందేడ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఆమె బ్యాగును దొంగలు తస్కరించారు. ఆబ్యాగులో 5 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉన్నాయి. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు. మరో సంఘటనలో బిహార్ రాష్ట్రానికి చెందిన సంజయ్ శేఖర్(53) కోట జంక్షన్‌లో కాచిగూడకు రావడానికి బికనూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. నాందేడ్ వద్ద అతని బ్యాగును దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో ఖరీదైన సెల్‌ఫోన్, 3500 నగదు ఉంది. కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

కవాడిగూడ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని నాలుగు రోజులుగా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చి బంద్ కొనసాగిస్తున్నారని అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

బాలోత్సవం ప్రారంభం

రాంనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో 5వ బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల జాతర గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణాచారి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఐఏఎస్ ఎస్.ఆర్.శంకరన్ చిత్రపటాన్ని ఎవరెస్టు శిఖరంపై పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణ ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు. పేదల ఐఏఎస్‌గా పేరు పొందిన ఎస్.శంకరన్ శిష్యుడిగా ఈ విషయంలో గర్వపడుతున్నానని అన్నారు. ప్రతి ఒక్కరూ కూడా చిన్న వయసు నుంచి పూర్ణ మాదిరిగా లక్ష్యాలను పెట్టుకుని ముందుకు సాగాలని పిల్లలకు సూచించారు. సాధించాలనే ఆశయం, కోరిక లేకపోతే జీవితం వ్యర్థమన్నారు. బాల్యం ఎంతో కీలకమైనదని, ప్రతి ఒక్కరూ లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, భారత్ గ్రూప్ ఆఫ్ ఇంటర్నేషనల్ చైర్మన్ సీ.హెచ్.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కే.వీ.రమణాచారి

బాలోత్సవంలో పిల్లల సందడి

బాలోత్సవం అట్టహసంగా ప్రారంభమై పిల్లల సందడితో ఆ ప్రాంతమంతా శోభను సంతరించుకుంది. సృజనాత్మక ప్రదర్శనలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. సైన్స్ ఎగ్జిబిషన్‌లో చిన్నారుల సృజనాత్మకత సంతరించుకుంది.

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కే మైనార్టీలు ఓటు వేయాలి

ముషీరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి, శాంతిభద్రతలను పరిరక్షించే బీఆర్ఎస్‌కే మైనార్టీలు ఓట్లు వేయాలని ఆ పార్టీ ముషీరాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు మహబూబ్‌ఖాన్ అన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించడంతోపాటు ఉన్న పథకాలను అమలు చేయకుండా మైనార్టీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ నాయకులు షాహెద్‌బాబా, వహీద్‌అలీ, ఫిరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్‌కు నిధుల మంజూరు

రాంనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని స్ట్రీట్ నెంబర్ 6, 15, 16లలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి కృషితో నూతన పైప్‌లైన్ నిర్మాణానికి రూ.2లక్షల నిధులు మంజూరయ్యాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీశంకర్ తెలిపారు. మంజూరైన నిధులతో జలమండలి అధికారులు తీసుకువచ్చిన తాగునీటి పైప్‌లైన్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని మూడు వీధులలో తాగునీటి సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ వేయాలని జనవరి 10న బీజేపీ నాయకులు స్థానికులతో కలిసి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చామన్నారు. దీంతో కిషన్‌రెడ్డి జలమండలి ఎండీకి లేఖ రాయగా ఎండీ స్పందించి స్థానిక జలమండలి అధికారులతో ఈ మూడు ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయించి అందుకు కావాల్సిన నిధులను మంజూరు చేశారని తెలిపారు. నిధుల విడుదలకు కృషిచేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జలమండలి ఎండీకి అడిక్‌మెట్ డివిజన్ ప్రజలు, పార్టీ తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పవన్‌రెడ్డి, నందు, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం రాయడంలో చాకచక్యం ఉండాలి

చిక్కడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వాస్తవిక విషయాలు చెబుతూ కత్తిలాంటి నిజాన్ని తీవ్రత లేని గాయం చేసేవిధంగా సంపాదకీయం రాయడానికి చాకచక్యం ఉండాలని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీకిరణం సంస్థ నిర్వాహకులు పొత్తూరి సుబ్బారావు రచించిన సంపాదకీయ సంపుటి ప్రకాశ కిరణాలు ఆవిష్కరణ సభ గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసి సంపుటిని ఆవిష్కరించిన రమణాచారి మాట్లాడుతూ సంపాదకుడు నిబద్ధత, నిజాయితీతో పని చేస్తే జీవితంలో సంపాదన ఉండదన్నారు. పొత్తూరి సుబ్బారావు ప్రతి అంశాన్ని విశ్లేషణతో సమతూకంతో రాసారన్నారు. ఆంధ్రప్రదేశ్ సమాచారహక్కుచట్టం పూర్వ చైర్మన్ పి. విజయబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బైస దేవదాసు, సంపుటిని అంకితం తీసుకున్న వీఎస్‌వీ ప్రసాద్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు బంద్

చిక్కడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ చౌరస్తాలో వాహనాల రాకపోకలను బంద్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం అశోక్‌నగర్ చౌరస్తాలో రోడ్డు కుంగిపోయి భారీ గొయ్యి ఏర్పడడంతో రోడ్డును తవ్వారు. ఈ క్రమంలో అశోక్‌నగర్ నుంచి ప్రాగాటూల్స్ వెళ్లడానికి, ప్రాగాటూల్స్ నుంచి హిమాయత్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడుతుండడంతో చౌరస్తాలో రాకపోకలను నిలిపివేసినట్లు చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు వెల్లడించారు. భారీ గొయ్యి తిరిగి పూడ్చి రోడ్డు ఏర్పాటు అయ్యేంత వరకు ఈ నిబంధన అమలులో ఉంటుందని ఆయన వివరించారు.

టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి : ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయం ఆవరణలో కార్మికుల సౌకర్యార్థం టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి భిక్షపతి కోరారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిత్యం కార్యాలయానికి కార్మికులు, కార్మికుల కుటుంబాలు వస్తుంటారని ముఖ్యంగా మహిళలకు టాయ్‌లెట్ సౌకర్యం లేకపోవడంవల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మిక కమిషనర్ కార్యాలయం ఆవరణలో కార్మికుల కోసం టాయ్‌లెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

రథస్థలి షెడ్డు ఏర్పాటు పనులు పూర్తి

చిక్కడపల్లి : చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం రథాన్ని ఉంచే రథస్థలి షెడ్డు పనులు పూర్తయ్యాయని ఆలయ ఈవో కె. రామాంజనేయులు తెలిపారు. నాలుగు నెలల కిందట రథాన్ని ఉంచే షెడ్డు వర్షాలకు కుప్పకూలిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమీ కాకపోయినప్పటికీ పక్కింటివారి ప్రహరీగోడతో పాటు కారు స్వల్పంగా ధ్వంసమైంది. ఈ క్రమంలో దేవాలయ భక్తుడు, దాత భాస్కర్ షెడ్డును నిర్మించి ఇచ్చారని వివరించారు.

ఆర్చరీ చాంపియన్‌షిప్‌కు కౌత్సవ్ ఎన్నిక

రాంనగర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్‌కు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కౌత్సవ్ (16) జాతీయస్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 5న మహబూబాబాద్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కౌత్సవ్ రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి గెలుచుకున్నారు. దీంతో పాటు జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. మణిపూర్ రాష్ట్రంలోని ఇంఫాల్‌లో డిసెంబర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున కౌత్సవ్ పాల్గొంటారు. అక్కడ జరిగే పోటీల్లో ఎంపికైతే కౌత్సవ్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. ఏడు సంవత్సరాలుగా నాగరాజు కోచ్ వద్ద కౌత్సవ్ ఆర్చరీ శిక్షణ పొందుతున్నారు.

విశ్వసాహితీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షురాలిగా అంజనీకుమారి

చిక్కడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విశ్వసాహితీ కళావేదిక సాహితీ, సాంస్కృతిక, స్వచ్ఛందసేవా సంస్థ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా సిటీ సివిల్‌కోర్టు సీనియర్ సూపరింటెండెంట్, ప్రముఖ సామాజికవేత్త పీవీపీ అంజనీకుమారి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తిరీత్యా సిటీసివిల్‌కోర్టులో అధికారిగా పనిచేసినా కూడా కళలు, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తితో పనిచేస్తున్నానని తన సేవలను గుర్తించి ఈ పదవి ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సామూహిక కార్తీకపౌర్ణమి దీపారాధన

ముషీరాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలీకాలనీలో స్థానిక మహిళలు సామూహిక దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా కమిటీ సీనియర్ నాయకురాలు సుజాత మాట్లాడుతూ ప్రతి కార్తీకమాసంలో సామూహిక దీపారాధన నిర్వహించి ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళా కమిటీ నాయకురాలు మంగ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

కుంగిన రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్

చిక్కడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ చౌరస్తాలో ఇటీవల అకస్మాత్తుగా కుంగిపోయిన రోడ్డును స్థానిక గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. సీవరేజ్ పైప్‌లైన్ పగిలిన కారణంగా లీకేజైన నీటి ప్రవాహంతో భూమిలోని మట్టి తడిచిపోయి అకస్మాత్తుగా రోడ్డు కుంగిపోయి గుంత ఏర్పడిందని ఈసందర్భంగా వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లు కార్పొరేటర్ పావనీకి వివరించారు. వెంటనే పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు జరిపి కుంగిన రోడ్డును మూసి యథావిధిగా రోడ్డును నిర్మించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, వాటర్‌వర్క్స్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగనోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రార్థన

చిక్కడపల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తమ మొర ఆలకించి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చేవిధంగా ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ నిరుద్యోగులు గురువారం ఎన్టీఆర్‌స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవంలో పాల్గొని శివున్ని ప్రార్థించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్‌నాయక్, సంపత్, రమేష్, మధు, చందు, వెంకటేష్, ఉపేందర్, లక్ష్మణ్, హరికృష్ణ, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.